క్లుప్తంగా

నేడు ఫణిగిరి బౌద్ధ మ్యూజియం ప్రారంభం

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరిలో నూతనంగా నిర్మించిన బౌద్ధ మ్యూజియం భవన ప్రారంభోత్సవానికి గురువారం మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌లు రానున్నట్లు ఎంపీడీఓ జి.శోభారాణి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కోతుల పట్టివేత

అర్వపల్లి : మండల పరిధిలోని పర్సాయపల్లిలో వందలాది కోతులు నిత్యం గుంపులుగా సంచరిస్తూ అనేక మందిని కరిచి గాయపరిచాయి. దీంతో గ్రామస్తులు మన ఊరు–మన పల్లె వాట్సాప్ గ్రూప్ ద్వారా ఏకమై గ్రామ మిత్రమండలి సహకారంతో విరాళాలు వేసుకొని కోతులను పట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. గత వారం రోజులుగా కోతుల పట్టివేత జరుగుతుంది. ఏపీలోని నెల్లూరు నుంచి కోతులు పట్టే వారిని రప్పించారు. ఇప్పటి వరకు 200 కోతులను పట్టి అడవులకు తీసుకెళ్లి వదిలినట్లు గ్రామస్తులు తెలిపారు. మొత్తం కోతులను పట్టే వరకు కార్యక్రమం కొనసాగుతుందని మిత్ర మండలి సభ్యులు తెలిపారు.

‘ప్రొటోకాల్ పాటించడంలో వివక్ష తగదు’

నూతనకల్ : ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రొటోకాల్ పాటించి విధిగా సమాచారం ఇవ్వాల్సిన మండల అభివృద్ధి అధికారి.. సమాచారం ఇవ్వకుండా వివక్షకు గురిచేస్తోందని ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ–2స్థానం నుంచి బీఆర్ఎస్ ఎంపీటీసీగా ప్రాతినిధ్యం వహిస్తున్న తనకు అభివృద్ధి కార్యక్రమాలకు సకాలంలో సమాచారం అందించడం లేదని ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి పంపిణీలో ఆలస్యంగా సమాచారం అందించడంలోని ఆంతర్యం ఏమిటని ఎంపీడీఓ ఇందిరను నిలదీశారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను గౌరవించాలని అన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలియజేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి బదిలీపై వెళ్లిన కె.అశోక్‌రెడ్డిని బుధవారం పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పని చేసిన ప్రతి చోట ఉత్తమ సేవలు అందించే వారికి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజు, ఉపేంద్ర, సత్తిరెడ్డి, శ్రీనివాస్, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

కిటికీ అద్దం కోసుకొని వ్యక్తి మృతి

సూర్యాపేట క్రైం : ఇంట్లోని కిటికీ అద్దం కోసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం పట్టణంలోని గొల్లబజారులో గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంగణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణానికి చెందిన జమాల్‌పురి రాజు(34) అతని భార్య భవాని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో నివాసం ఉంటున్నారు. భార్యభర్తల మధ్య గత కొన్నాళ్లుగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. మంగళవారం భార్యభర్తలు ఇద్దరు ఘర్షణపడ్డారు. ఇంట్లోని కిటికీ అద్దంకు రాజు కుడిచేతితో గట్టిగా కొట్టడంతో అద్దం కోసుకొని తీవ్ర రక్తస్రావం అయ్యింది. దీంతో అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. వెంటనే పోలీసులు రాజును సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. రాజు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి లక్ష్మీబాయి తన కుమారుడిని కోడలు భవాని, ఆమె సోదరి దంపతులు హత్యచేసి పరారయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజు మద్యం మత్తులో కిటికీని ధ్వంసం చేసే క్రమంలో చేతికి గాయమై తీవ్ర రక్తస్రావంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

సీసీ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, తదితరులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండలో గల 5వ వార్డులో సీడీపీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ చింత కవితారాధారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ.సలీం, ఆత్కూరి శేషు, రఫీ, సురేష్, రంగయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను కమ్మేస్తున్న చెట్లు !


ఏనుబాముల - ఆత్మకూరు రోడ్డులో ఉన్న కంపచెట్లు


ఏపూరు - బొప్పారం రహదారిపై..

- ప్రమాదకరంగా మారిన రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. రహదారులపై ఏ సమయంలో ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రం నుంచి ఏనుబాముల, అలాగే మండల కేంద్రం నుంచి నెమ్మికల్, ఏపూరు నుంచి బొప్పారం వెళ్లే రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇందులో ఆత్మకూరు – నెమ్మికల్ డబుల్ రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా నాటిన మొక్కలే చెట్లుగా పెరిగి రోడ్డుకు అడ్డంగా వస్తున్నాయి. ఈ చెట్లు అక్కడక్కడ రోడ్డును కమ్మేస్తున్నట్లుగా కిందికి ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఆత్మకూరు – ఏనుబాముల రహదారిలోనూ పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు కమ్ముకొస్తున్నాయి. ఈ చెట్లు సరిగ్గా మూలమలుపుల వద్దనే ఉండడంతో ఎదురుగా వాహనాలు అతి సమీపానికి వచ్చేవరకు కనిపించడం లేదు. ఇక ఏపూరు – బొప్పారం రహదారి పైన హరితహారం మొక్కలు రోడ్డుకు దగ్గరగా నాటడంతో ఆ చెట్లు భారీగా పెరిగి ప్రస్తుతం ప్రమాదకరంగా మారాయి. చాలా రోజులుగా ఆయా రహదారులు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు అడ్డంగా ఉన్న హరితహారం చెట్ల కొమ్మలను, కంప చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల అభివృద్ధికి శాయశక్తులా కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల అభివృద్ధికి ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌తో అత్యధిక నిధులు మంజూరు చేయించుకొని తమ శాయశక్తులా కృషి చేస్తున్నట్లు ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ తెలిపారు. బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం జలాలతో మండలం సస్యశ్యామలం అయిందని చెప్పారు. జాజిరెడ్డిగూడెం–అర్వపల్లి విద్యుత్ ఫీడర్ వేరుచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని నాలుగున్నర ఏళ్ల నుంచి మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే అర్వపల్లి–జాజిరెడ్డిగూడెం విద్యుత్ ఫీడర్ వేరుచేసి రెండు గ్రామాల ప్రజల సమస్యను తీర్చాలని కోరారు. అలాగే శాఖల వారీగా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కతురోజు ఉమేష్, నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, ఎంపీఓ సందీప్‌కుమార్, ఏఓ శశిధర్‌రెడ్డి, ఎంఈఓ బాలునాయక్, వైద్యాధికారి హర్షద్, ఏఈఈలు అశోక్, మహేష్, శ్రీకాంత్, హరిస్వరూప్, హెచ్‌డబ్ల్యూఓ రామానుజాచార్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో పూజలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెమం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని బుధవారం హైదరాబాద్‌లోని ఇంటలిజెన్స్ డీఎస్పీ తులా శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర విశిష్టతను సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి డీఎస్పీకి వివరించారు. అలాగే డీఎస్పీ శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా


సంఘీభావం తెలుపుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

చివ్వెంల : తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశావర్కర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని, అర్హులైన వారికి సెకండ్ ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్సేని, సైదమ్మ, కవిత, విజయ, సువర్ణ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి


మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

తుంగతుర్తి : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోసం జరిగిన పోరాటంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలని తుంగతుర్తి అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రంలో నిర్మించాల్సిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌లు వేరే చోట నిర్మించాలని ప్రకటించడంతో అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించామన్నారు. అప్పుడు అఖిలపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేసి తప్పుడు కేసులు బనాయించారని, ఆ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ధర్నా చేసిన వారిలో వృద్ధులు, మహిళలు ఉన్నారని తెలిపారు. వారంతా గత ఐదున్నర సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. క్యాంపు కార్యాలయం కోసం జరిగిన పోరాటంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు మల్లెపాక సాయిబాబు, పెద్దబోయిన అజయ్, గాజుల మహేందర్, కొండ రాజు, గంగరాజు, సైదులు, సోమన్న, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

భానుపురి : ఈనెల ఏడవ తేదీన అలంపూర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టనున్న విశ్వరూప మహాపాదయాత్ర కరపత్రాలను సూర్యాపేట పట్టణంలోని జగ్జీవన్ భవన్‌లో బుధవారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ తురుకంటి అంజయ్య మాట్లాడారు. నవంబర్‌లో జరిగే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌తో మంద కృష్ణ మాదిగ ఈ పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, బోడ శ్రీరాములు, సావిత్ర, నాగేశ్వరి, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

15నుంచి డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు


నాగారంలో డీటీఎఫ్ మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

నాగారం : మహబూబ్‌నగర్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య కోరారు. బుధవారం నాగారం మండల కేంద్రంలో డీటీఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. డీటీఎఫ్ సంస్థ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని అన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి. ఆనంద్ భాస్కర్, జిల్లా కార్యదర్శులు సిద్దిఖ్‌పాషా, బి.క్రాంతికుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటమల్లు, బి.శ్రీహరి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ‘గృహలక్ష్మి’


తిరుమలగిరిలో గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యేలు కిషోర్, భూపాల్‌రెడ్డి


తుంగతుర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తిరుమలగిరి : అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామని తుంగతుర్తి శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో 300 మంది గృహ లక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు రూ.3 లక్షలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకునేందుకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు.

అభివృద్ధి దిశగా తుంగతుర్తి నియోజకవర్గం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 9 ఏళ్లలో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి దిశలో పయనిస్తుందని నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గతంలో తుంగతుర్తి నియోజకవర్గంలో కక్షలు, ఘర్షణలు ఉండేవని.. ప్రతి ఊరి గ్రామ శివారులో స్థూపాలే దర్శనమిచ్చేవని తెలిపారు. ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ గెలిచిన తరువాత నియోజకవర్గం పంటలతో సమృద్ధిగా అభివృద్ధి చెందిందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగేంధర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని ప్రవంతిసతీష్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, తిరుమని యాదగిరి, తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండేందుకే..

తుంగతుర్తి : ప్రజలకు అందుబాటులో ఉండేందుకే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ తెలిపారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను సమానదృష్టితో చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ రజాక్, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రవంతి, జెడ్పీటీసీ వీరప్రసాద్, ఎంపీటీసీలు కేతిరెడ్డి లతారెడ్డి, సృజనపరమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతయ్య, పులుసు యాదగిరి, వెంకన్న, రవికుమార్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఏఓ జానిమియా

సూర్యాపేట రూరల్ : ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి జానిమియా రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని బాలెంల గ్రామం రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఆయేషా, రైతులు శివరాత్రి లింగయ్య, గంట సోమయ్య, శివరాత్రి బుచ్చిరాములు, యాదగిరి, బలగాని కాటం గౌడ్, పేరం లక్ష్మయ్య, భూపతి అశోక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం మండలానికి చేరిన బతుకమ్మ చీరలు

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆడపడుచులకు పంపిణీ చేసే బతుకమ్మ చీరలు మండల కేంద్రానికి చేరాయని స్థానిక ఎంపీడీఓ జి.శోభారాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలానికి ప్రస్తుతం 8,793 బతుకమ్మ చీరలు వచ్చినట్లు తెలిపారు. ఈ చీరలను మండలంలోని గ్రామ పంచాయతీలకు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే చీరల పంపిణీ ప్రక్రియను చేపడతామని తెలిపారు. ఆమెతో పాటు సూపరింటెండెంట్ ముత్తయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నాయకులు


ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తున్న నాయకులు

మద్దిరాల : జిల్లా కేంద్రంలో జరిగే గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని గ్రామాల నుంచి బుధవారం గౌడ సంఘం నాయకులు మోకు, ముస్తాద్‌లను ధరించి భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కన్న వీరన్నగౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు గుండ్ల నాగేందర్‌గౌడ్, తీగల వెంకన్నగౌడ్, మోడెం వెంకన్న, కార్యదర్శి మల్లయ్య, మద్దెల వెంకన్న పాల్గొన్నారు.

మాదిగ సామాజికవర్గానికి కేటాయించాలి

తుంగతుర్తి : తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్‌ను తెలంగాణ ఉద్యమకారుడైన పిడమర్తి రవికి ఇవ్వాలని మాదిగ జేఏసీ మండల ఇన్‌చార్జ్ ఇమ్మడి సుధాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో మాదిగ కులానికి 50వేలకు పైగా ఓట్లు ఉండటంతో మాదిగ సామాజికవర్గానికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలన్నారు. పిడమర్తి రవికి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించినట్లయితే నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటారని అన్నారు.

పూజా సామగ్రి బహూకరణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన ఉప్పల వెంకట్‌రెడ్డి–మాధవి దంపతులు బుధవారం పూజా సామగ్రి, వస్తువులను బహూకరించారు. పూజా సామగ్రి, వంటపాత్రలు, ఇతర సామగ్రిని ఆలయ అర్చకుడు అర్వపల్లి పవన్‌కుమార్‌కు అందజేశారు. వీటి విలువ సుమారు రూ. 10 వేలు చేస్తుందని దాత తెలిపారు.

బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి పంపిణీ


సూర్యాపేట : పట్టణంలోని 45వ వార్డులో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న కృపాకర్


మద్దిరాల : పంచాయతీ కార్యదర్శులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్


పెన్‌పహాడ్ : క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీపీ భిక్షం, జెడ్పీటీసీ అనిత

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 45వ వార్డులో నిర్వహించిన బతుకమ్మ చీరల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి ఉపేంద్రాచారి, ఆర్పీ విజయ, వార్డు అధ్యక్షులు కుక్కడపు సాలయ్య, భిక్షం, కళ్యాణ్ పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ధరావతు కుమారిబాబు నాయక్ బతుకమ్మ చీరలు, క్రీడ సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ గోపి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం గ్రామాల వారీగా బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ రాజేష్, సిబ్బంది నదీమ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, తరుణ్, రమేష్, మహేష్, మంగ, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పాలనలో క్రీడాకారులకు, క్రీడలకు అధిక ప్రాధాన్యం లభిస్తోందని ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రి, మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాంపతి, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మామిడి రేవతి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా సామగ్రి, బతుకమ్మ చీరలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిర, ఎంపీఓ శశికళ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కోదాడ : మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. కోదాడలో ఆర్డీఓ కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌కు బుధవారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ముత్యాలు, గీత, అన్నపూర్ణమ్మ, తిరుపతమ్మ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి

మోతె : సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మోతె మండల కేంద్రంలో యువతకు క్రీడా సామగ్రి, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు, ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ ప్రకాష్‌రావు, ఎంపీఓ హరిసింగ్, ఏపీఎం నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు


మద్దిరాలలో పదవీ విరమణ పొందుతున్న మల్లయ్యను సన్మానిస్తున్న ఎస్ఏ.రజాక్

మద్దిరాల : కష్టపడి పనిచేసే వారికి తోటి అధికారులతో పాటు, ప్రజల్లో తప్పకుండా మంచి గుర్తింపు ఉంటుందని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయానికి చెందిన అటెండర్ మల్లయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మల్లయ్యను సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాములు నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అక్కిరెడ్డి జ్యోతి, ఉపేందర్‌రెడ్డి, బర్పటి ఉపేందర్, వెలుగు వెంకన్న, దామెర్ల వెంకన్న, కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి, బొబ్బిలి వెంకన్న, జలేందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


అనంతారంలో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వట్టె రేణుక


ఆర్థికసాయం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెన్‌పహాడ్ : అనంతారం గ్రామానికి చెందిన బీఎస్పీ మండల అధ్యక్షుడు బీంపంగి నాగరాజు నాయనమ్మ బీంపంగి ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. లింగాల గ్రామానికి చెందిన వీరబోయిన అచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బుధవారం బాధిత కుటుంబాలను బీఎస్పీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వట్టె రేణుక పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బుడిగ మల్లేష్, మహ్మద్ చాంద్‌పాషా, ఆవుల అంజయ్య వల్లాల బుచ్చయ్య, చింతకాయల జానయ్య, సుమన్, ఉపేందర్, కిరణ్ పాల్గొన్నారు.

నూతనకల్ : తాళ్లసింగారం గ్రామానికి చెందిన మల్యాల నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహకారం అందజేశారు. సర్పంచ్ చూడి లింగారెడ్డి 50కేజీల బియ్యం, బీఆర్ఎస్ మండల నాయకులు పన్నాల సైదిరెడ్డి, తాడూరి లింగయ్య, మట్టపల్లి గంగయ్య, తాడూరి సైదులు, చేపూరి శ్రీనివాస్‌రెడ్డి, పల్స శ్రీహరిలు రూ.14వేల నగదును అందజేశారు.

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో నాగారం మండల పరిధి నుంచి ముగ్గురు ఉద్యోగానికి ఎంపికైనారు. నాగారంబంగ్లాకు చెందిన కడారి ప్రశాంత్‌రెడ్డి, తొడుసు జ్యోతి, నాగారం గ్రామానికి చెందిన నూక మహేష్ సివిల్ కానిస్టేబుల్స్‌గా ఎంపికైనారు. వీరి ఎంపిక పట్ల ఆయా గ్రామాల ప్రజలు అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.